

షెడ్యూల్ ప్రకారం జాబితా

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులను షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. 8లో



ఒకేరోజు మూడు ఇళ్లలో చోరీ

సత్తుపల్లిలోని వివిధ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో చొరబడిన దొంగలు రూ.12లక్షలకు పైగా సొత్తు ఎత్తుకెళ్లారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఎండ ఎక్కువగా ఉండే అవకాశముంది. మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఎర్రుపాలెం మండలం మీనవోలుకు చేరుకోనున్న భట్టి మీనవోలు సహా వివిధ గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 3గంటలకు ఎర్రుపాలెంలో స్థానికులు, నాయకులతో సమావేశమై రాత్రి 7గంటలకు మధిరకు చేరుకుని బస చేయనున్నారు.

మంత్రుల పర్యటన

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్యాహ్నం 12గంటలకు ఖమ్మం చేరుకోనుండగా ఇల్లెందు క్రాస్ సమీపాన ఐటీ హబ్ వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత హరిత గార్డెన్స్‌లో జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉదయం 9.30గంటలకు నేలకొండపల్లిలో భక్తరామదాసు ధ్యాన మందిరాన్ని ప్రారంభించి సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందిస్తారు. ఆతర్వాత 11గంటలకు రాయిగూడెంలో చేరుకుని చెరువుమాధారం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి మధ్యాహ్నం 12గంటలకు నాయుడుపేట సర్కిల్‌లో పొంగులేటి శ్రీనన్న ఉచిత కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఒంటి గంటకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించి 3-30గంటలకు కూసుమంచి క్యాంప్ ఆఫీస్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశాక హైదరాబాద్ బయలుదేరతారు.

విషజ్వరాల వ్యాప్తిని అరికడదాం..



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుబ్బారావు

చింతకాని: వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. చింతకాని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్యసేవలను తెలుసుకున్నారు. ఆతర్వాత ల్యాబ్, ఫార్మసీల్లో రికార్డులు, రోజువారీ పరీక్షలపై ఆరా తీశారు. సీజనల్ జ్వరాల తీవ్రత ఉన్నందున ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించాలని, గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించడమే కాక గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి డ్రై డే పకడ్బందీగా నిర్వహించాలని, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు. అనంతరం లచ్చగూడెం, నేరడ, కోమట్లగూడెంల్లో వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు వేణుమాధవ్, ల్యాబ్ టెక్నీషియన్ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ లేదు.. సాగు కాదు



కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని జగన్నాథుల చెరువు

సమృద్ధిగా వర్షాలు కురిసినా నిండని చెరువులు

- జిల్లాలో పూర్తిగా నిండినవి 27 మాత్రమే
- ఆయకట్టు పరిధిలో సాగుకు రైతుల వెనుకంజ
- వరి అంచనాలో సగం మేర కూడా పడని నాట్లు

జిల్లాలో రెండు, మూడు నెలలుగా సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతోంది. అయినా అనేక చెరువుల్లోకి నీరు చేరక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా పంటల సాగు ఊపందుకోలేదు. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి అంచనాలను అందుకునే పరిస్థితి కానరావడం లేదు. సాగర్ ఆయకట్టు మినహా చెరువుల కింద సాగు చేసిన పంటలకు నీరు అంతంత మాత్రంగానే అందుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లాలో మొత్తం చెరువులు	984
0-25 శాతం నిండిన చెరువులు	65
25-50 శాతం నిండిన చెరువులు	154
50-75 శాతం నిండిన చెరువులు	288
75 -100 శాతం నిండిన చెరువులు	450
మత్తడి పోస్తున్న చెరువులు	27

ప్రాజెక్టుల్లోకి చేరిన నీటి నిల్వలు (అడుగుల్లో)

ప్రాజెక్టు	నీటినిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
పాలేరు	23	19.2
వైరా	18.03	18
లంకాసాగర్	16	14.10
బేతుపల్లిచెరువు	16	16
జాలిముడి	15	15.6
కట్టలేరు	07	7.1

చెరువులు వెలవెల..

జిల్లాలో మొత్తం 984 చెరువుల కింద 1.50 లక్షల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఇందులో 65 చెరువుల్లో 25 శాతం నీరు మాత్రమే ఉండగా.. 154 చెరువుల్లో 25 శాతం నుంచి 50 శాతం నీరు చేరింది. ఇక 288 చెరువులు 50 నుంచి 75 శాతం, మరో 450 చెరువులు 75 నుంచి 100 శాతంలోపు నీటితో ఉన్నాయి. కేవలం 27 చెరువులే పూర్తిస్థాయిలో నిండాయి. ఇటీవల వర్షాలు కురవడంతోపాటు నాగార్జునసాగర్ జలాలను కూడా విడుదల చేశారు. అయినా చెరువుల్లోకి నీరు చేరకపోవడానికి పూడిక పేరుకుపోవడమే కారణమని తెలుస్తోంది. దాదాపు 500కు పైగా చెరువుల్లో ఆశించిన మేరకు నీరు లేకపోవడం సాగుపై ప్రభావం చూపుతోంది.

నిండని జగన్నాథుల చెరువు..

కొణిజర్ల మండలం అమ్మపాలెంలో 65 ఎకరాల ఆయకట్టు ఉన్న జగన్నాథుల చెరువు పూర్తిగా వర్షాధారంగానే నిండుతుంది. ఇప్పటికీ ఆశించిన మేర నీరు చేరలేదు. కొద్దిపాటి నీరే ఉండడంతో తూములకు ఎక్కడం లేదని రైతులు చెబుతున్నారు. ఇంకో రెండు, మూడు వర్షాలు పడితే తప్ప పొలాలకు నీరందే అవకాశం లేదని భావిస్తున్నారు.

వర్షాభావంతోనే..

నిన్నామొన్నటి వరకు సాగర్ ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోవడం, వర్షాలు లేకపోవడంతో చెరువులు వట్టిపోయాయి. వర్షాధారంతో నిండే చెరువులు సహజంగా డిసెంబర్, జనవరి నాటికి ఎండిపోయి వర్షాలు కురిశాక జలకళ సంతరించుకుంటాయి. ఈ ఏడాది జూలై వరకు పూర్తిస్థాయిలో వర్షాలు కురవలేదు. ఆపై వర్షాలు కురవడమే కాక ఇటీవల సాగర్ జలాలు విడుదల చేయడంతో చెరువుల్లోకి ఇప్పుడిప్పుడే నీరు వస్తోంది. ఫలితంగా చెరువుల కింద ఆయకట్టులో సాగు జోరందుకోలేదు. మరోపక్క సాగర్ ఆయకట్టు కింద మాత్రం రైతులు సాగులో నిమగ్నమయ్యారు. జిల్లాలో వరి 2,83,943 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు లక్ష లోపు ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. మరింత జోరుగా వర్షాలు కురిస్తేనే సాగు పెరుగుతుందని భావిస్తున్నారు.

జలాశయాల్లో ఆశాజనకమే..

సాగర్ జలాల విడుదలతో జిల్లాలోని ప్రాజెక్టులు నిండుతున్నాయి. పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 23 అడుగులకు గాను 19.2 అడుగులకు చేరింది. ప్రతిరోజు 3,269 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇక వైరా రిజర్వాయర్ సామర్థ్యం 18.03 అడుగులు కాగా 18 అడుగుల మేరకు నీరు ఉంది. లంకాసాగర్ ప్రాజెక్టులో 16 అడుగులకు 14.10 అడుగులు, బేతుపల్లి చెరువు 16అడుగులు, జాలిముడి ప్రాజెక్టులో 15 అడుగులకు పూర్తి స్థాయిలో నీరు ఉంది. దీంతో ఈ ప్రాజెక్టుల కింద పంటల సాగు ఊపందుకుంది.

రుణమాఫీ కాలేదు సార్...



నేలకొండపల్లిలో ఏఓ ప్రసాద్‌రావును చుట్టుముట్టిన రైతులు

- జిల్లాలో 15 వేల ఫిర్యాదులు
- క్లస్టర్ల వారీగా విభజిస్తున్న వ్యవసాయ శాఖ

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో రుణమాఫీ కాలేదంటూ అధికారులకు మంగళవారం నాటికి 15 వేల ఫిర్యాదులు అందాయి. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించగా.. ఇప్పటికే మూడు విడతల్లో అమలు చేశారు. లీడ్ బ్యాంక్ లెక్కల ప్రకారం జిల్లాలో 3,73,157 మంది రైతులు రూ.4,307 కోట్లు పంట రుణాలు తీసుకోగా.. మూడు విడతల్లో 1,15,627 మంది రైతులకు రూ.770,95,798 మేర రుణాలు మాఫీ అయ్యాయి. దీంతో మిగతా వారు తాము అర్హులైనా మాఫీ కాలేదంటూ బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇందులో 15 వేల మంది రైతులు ఫిర్యాదు చేయగా.. వీటిని అధికారులు క్లస్టర్ల వారీగా విభజిస్తున్నారు. అనంతరం అర్హత ఉండి మాఫీ జరగని రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖకు పంపించనుండగా, ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేసే అవకాశముందని తెలుస్తోంది.

అధికారుల నిలదీత...

రుణమాఫీ పొందేందుకు అర్హత ఉన్నా కాలేదంటూ నేలకొండపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలువురు రైతులు వ్యవసాయాధికారులను నిలదీశారు. తొలుత ఏఓ ప్రసాద్‌రావు మాట్లాడుతుండగా అడ్డుకున్న రైతులు రుణమాఫీ వర్తించకపోవడంపై ఆగ్రహించారు. దీంతో సమావేశం రసాభసాగా మారగా.. ఏఓ తమకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని చెప్పడంతో మండిపడ్డారు. విధి విధానాలు లేనప్పుడు సమావేశం ఎందుకు నిర్వహించారని నిలదీస్తూ రైతులు వెనుదిరిగారు. ఈ సమావేశంలో ఏఈఓలు శిరీష, దుర్గాభవాని, అవినాష్, పార్టీలు, సంఘాల నాయకులు తీగ వెంకటేశ్వర్లు, దండా నర్సింహారావు, నూక హన్మంతరావు, పాకనాటి సీతారామిరెడ్డి, పాపయ్య, నాగేశ్వరరావు, వెంకన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు



అడ్‌హక్ కమిటీ బాధ్యులకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా కమిటీ ని రద్దుచేసి అడ్‌హక్ కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ వెల్లడించారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రత్యేక పరిస్థితుల్లో జిల్లా కార్యవర్గాన్ని రద్దు చేయగా సభ్యత్వాల నమోదు కోసం అడ్‌హక్ కమిటీని నియమించామని తెలిపారు. జిల్లా కన్వీనర్‌గా ముత్యాల నారాయణగౌడ్, కోకన్వీనర్లుగా కొణిదన శ్రీనివాస్, ఆర్‌వీఎస్.సాగర్, సభ్యులుగా కొమరగిరి దుర్గాప్రసాద్, జడ్‌ఎస్.జైపాల్, శ్రీధర్‌సింగ్, కె.లలితకుమారి, నందగిరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జి.శ్రీనివాసరావు, యర్రా రమేష్, టి.శ్రీకాంత్, ఎస్.ప్రకాశరావు, పి.రాధాకృష్ణ, భూస చంద్రశేఖర్, హరికృష్ణ, జంగం లక్ష్మణరావు, రవికుమార్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరాలకు స్ఫూర్తి.. రాజీవ్‌గాంధీ

మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి



ఎంపీ రఘురాంరెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: సాంకేతిక విప్లవానికి పునాదులు వేసి నవ భారత నిర్మాణానికి కృషిచేసిన దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని కూసుమంచిలో మంగళవారం ఆయన విగ్రహానికి మంత్రి, ఎంపీ నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, నాయకులు రామసహాయం వెంకటరెడ్డి, ఎండీ.హఫీజుద్దీన్, మంకెన వాసు, అహ్మద్ అలీ, వినోద, బారి శ్రీను, రాంకుమార్, సేట్రాంనాయక్, పరుశురాం, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మంసహకారనగర్: వసతి గృహాల సంక్షేమ అధికారులు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులు, వార్డెన్లతో సమీక్షించారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దేలా పర్యవేక్షించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం సమకూర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు కార్యక్షేత్రంలోనే ఉంటూ విద్యార్థుల హాజరును పర్యవేక్షించాలని ఆదేశించారు. అంతేకాక వసతులు కల్పించాలని, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ తెలిపారు. అలాగే, సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ విద్యార్థుల పురోగతిని ప్రతీ మూడు నెలలకోసారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల అధికారులు కె.సత్యనారాయణ, విజయలక్ష్మి, జ్యోతి, ఎం.ఎ.మహమూదీ పాల్గొన్నారు.

ఆర్టీసీకి కాసుల పండుగ!



సోమవారం డిపోల వారీగా బస్సులు తిరిగిన కిలోమీటర్లు, ఓఆర్, ఆదాయం

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.లక్షల్లో)	ఓఆర్ శాతం
ఖమ్మం	72,032	60.38	116
భద్రాచలం	56,224	42.91	107
సత్తుపల్లి	47,648	35.06	102
మణుగూరు	30,569	26.98	129
కొత్తగూడెం	28,025	25.07	128
మధిర	29,275	24.80	118
ఇల్లెందు	8,511	5.97	101
మొత్తం	2,72,284	221.17	

- రాఖీ సందర్భంగా ప్రయాణాల రికార్డ్
- 129 శాతం ఓఆర్‌తో రీజియన్‌లో మణుగూరు ముందంజ
- 2.72లక్షల కి.మీ. ప్రయాణంతో రూ.2.21కోట్ల ఆదాయం



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఖమ్మం మయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లిన ఆడపడుచులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడంతో సోమవారం ఆదాయం దండిగా లభించింది. ఖమ్మం రీజియన్‌లో అన్ని డిపోల్లో 100శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) తగ్గకపోగా.. బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక అత్యధిక స్థాయిలో ఓఆర్ నమోదు కావడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. రీజియన్‌లో మణుగూరు డిపో ద్వారా అత్యధికంగా బస్సులు 30,569 కి.మీ. మేర రాకపోకలు సాగించగా 129శాతం ఓఆర్‌తో రూ.26.98లక్షల ఆదాయం నమోదైంది.

ముందస్తు ప్రణాళికతో

రాఖీ పండుగ సందర్భంగా బస్సుల్లో రద్దీ పెరుగుతుందని అధికారులు ముందుగానే భావించారు. రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆదేశాలతో డిపోమేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సహా ఇతర ఉద్యోగులంతా బస్టాండ్లలో మకాం వేసి రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బస్సులు నడిపించారు. హైదరాబాద్ నుంచి రద్దీ పెరుగుతుండగా ఖమ్మం రీజియన్‌లో డిపోలకు అదనంగా వంద సర్వీసులు నడిపించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. అలాగే, ఖమ్మంతో పాటు ఇతర డిపోల నుంచి కొన్ని సర్వీసులు అదనంగా తిప్పారు. గతేడాది రాఖీ పండుగ రోజున 85శాతం ఓఆర్ నమోదు కాగా.. ఈసారి రీజియన్‌లో సగటున 114 ఓఆర్ శాతం సాధించడం విశేషం. కాగా, రాఖీ పండుగ రోజైన సోమవారం రీజియన్ వ్యాప్తంగా 2.87 లక్షల మంది ప్రయాణించగా ఇందులో 1.84 లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకున్నారు.

డిపోల వారీగా..

ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల్లో కలిపి బస్సులు 2,72,284 కి.మీ. మేర రాకపోకలు సాగించాయి. తద్వారా సంస్థకు 73శాతం ఎర్నింగ్ పర్ కిలోమీటర్(ఈపీకే)తో రూ.2.21కోట్లకు పైగా ఆదాయం లభించింది. డిపోల వారీగా పరిశీలిస్తే ఖమ్మం 75.09, మధిర 73.94, సత్తుపల్లి 66.44, భద్రాచలం 69.08, కొత్తగూడెం 80.35, మణుగూరు 80.47, ఇల్లెందు డిపో 63.76 శాతం చొప్పున ఈపీకే సాధించాయి.



సత్తుపల్లి డిపోలో ఉద్యోగులకు స్వీట్లు అందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సమష్టి కృషితోనే..



రీజియన్‌లోని అన్ని డిపోల ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగానే అత్యధిక ఓఆర్ సాధించగలిగాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు లక్ష్యాలను చేరుకున్నాం. సాధారణంగా రోజుకు సుమారు 2లక్షల కి.మీ. మేర బస్సులు తిరుగుతాయి. రాఖీ పండుగకు 72వేల కి.మీ.లు అదనంగా తిప్పి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాం.

– సరిరామ్, ఆర్టీసీ ఆర్.ఎం, ఖమ్మం

క్లుప్తంగా

గ్రేడ్‌-1 ప్రిన్సిపాల్‌గా పదోన్నతి


స్రవంతి

బోనకల్‌: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన బోళ్ల స్రవంతి గ్రేడ్‌-1 పిన్సిపాల్‌గా పదోన్నతి సాధించింది. 2019 గురుకుల నోటిఫికేషన్‌లో ఆమె టీజీటీ, పీజీటీ, జేఎల్‌, డీఎల్‌గా ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించింది. అనంతరం మెదక్‌ జిల్లా కొడిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో చరిత్ర విభాగం జూనియర్‌ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ప్రస్తుతం ఆమెకు గ్రేడ్‌-1 ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి దక్కడం గ్రామస్తులు పలువురు అభినందించారు.

విద్యార్థుల స్థాయి పెంపునకు కృషి


విద్యార్థులను పరీక్షిస్తున్న అధికారి

ఖమ్మంఅర్బన్‌: పాఠశాలల్లో విద్యార్థుల స్థాయిని పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్‌ మానటరింగ్‌ అధికారి కె.రవికుమార్‌ సూచించారు. ఖమ్మం 8వ డివిజన్‌ వైఎస్సార్‌ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 1, 3, 5వ తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

విద్యార్థులకు తపాలా స్కాలర్‌ షిప్‌

ఖమ్మంగాంధీచౌక్‌: 'దీన్‌ దయాల్‌ స్పర్శ్‌ యోజన పథకం' కింద భారత తపాలా శాఖ ఫిలాటలీ స్కాలర్‌ షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని ఖమ్మం డివిజన్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ వి.వీరభద్రస్వామి తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతూ తపాలా శాఖలో అకౌంట్‌ కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ ఆరు సెప్టెంబర్‌ 13 నాటికి 'సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోస్టాఫీసెస్‌, ఖమ్మం డివిజన్‌, ఖమ్మం 507003' చిరునామాకు పంపించాలని, వివరాలకు సమీప పోస్టాఫీసుల్లో లేదా www.indiapost.govt.in వెబ్‌సైట్‌ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

పోలీసుల అదుపులో యువకులు?

నేలకొండపల్లి: మండలానికి చెందిన కొందరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెంకు చెందిన పలువురు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు విచారిస్తున్నట్లు సమాచారం. వీరిని పరీక్షించాక గంజాయి సేవిస్తున్నారా, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నారా అనేది నిర్ధారణ కానుందని తెలిసింది. ఈ విషయమే నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్‌ను వివరణ కోరగా కొందరిని అదుపులోకి తీసుకున్నది నిజమే అయినా విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

పాతకక్షలతో దాడి


గాయపడిన సంఘయ్య

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మరొకరు కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ధనియాకుల సంఘయ్య మంగళవారం తన పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన కె.నవీన్‌ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. నవీన్‌పై కొన్నాళ్ల క్రితం సంఘయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ కోపం మనసులో పెట్టుకుని దాడి చేశాడని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్‌ షరీఫ్‌ తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కూసుమంచి: మండలంలోని బికారితండాలో మంగళవారం ప్రమాదవశాత్తు షార్ట్‌ సర్క్యూట్‌ జరగగా పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. తండాకు చెందిన ఎర్రనాగుల బోడియా ఇల్లు కాలిపోగా సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం జరిగిందని వాపోయారు. ఈమేరకు ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆయన కోరాడు.

ఖమ్మం మార్కెట్‌ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,600	4,500
మిర్చి	16,800	9,000
ఏసీ మిర్చి	19,400	10,000
ఏసీ తాలు	10,000	8,800
పత్తి	7,300	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్‌ గెలలు

టన్ను ధర	రూ.13,828

మరణమా.. జాలి లేదా?

కవల సోదరులను బలి తీసుకున్న రోడ్డుప్రమాదం
- బైక్‌ను ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో ఘటన
- దానవాయిగూడెంలో విషాదం

తల్లి గర్భం నుంచి సెకన్ల తేడాతో లోకంలోకి వచ్చిన వారిద్దరూ కలిసే పెరిగారు. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఉద్యోగాలు సాధించి కూలీనాలి చేస్తూ తమను పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలని భావించాలనే తపనతో కష్టపడుతున్నారు. ఇంతలోనే వీరిని మృత్యువు ఒకేసారి బలి తీసుకుంది. 22ఏళ్లుగా కలిసి పెరుగుతున్న సోదరులను కలిపే తీసుకెళ్లిన జాలి లేని మృత్యువును శాపనార్థాలు పెడుతున్న వారి బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషాద ఘటన ఖమ్మం రూరల్‌ మండలం మద్దులపల్లి సమీపాన మంగళవారం చోటు చేసుకుంది. – ఖమ్మంరూరల్‌

నిరుపేద కుటుంబం...

ఖమ్మం రూరల్‌ మండలం దానవాయిగూడెంకు చెందిన అత్తులూరి నర్సింహారావు, రమాదేవి దంపతులు కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహేష్‌, నవీన్‌(22) కవల కుమారులు ఉన్నారు. సోదరులిద్దరు డిగ్రీ పూర్తిచేయగా గ్రూప్స్‌తో పాటు పోలీసు ఉద్యోగ నియామక పరీక్షలకు సిద్ధమవుతూ కొన్నాళ్లుగా ఖమ్మంలోని ఓ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారు. మంగళవారం ఉదయం తల్లి రోజులాగే కూలీ పనులకు వెళ్లగా తండ్రి ఇంకో గ్రామానికి వెళ్లాడు. దీంతో సాయంత్రం సోదరులిద్దరూ బైక్‌పై స్నేహితుడైన భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌కు చెందిన పవన్‌తో కలిసి తమ అమ్మమ్మ ఊరైన కూసుమంచి మండలం పెరికసింగారం బయలుదేరారు. అక్కడ వీరి మేనమామ మెకానిక్‌ షెడ్‌ నిర్వహిస్తుండడంతో అప్పుడప్పుడు వెళ్లి కాసేపు గడిపి వచ్చేవారు. అలాగే, మంగళవారం కూడా వెళ్లిన సోదరులు గమ్యస్థానానికి చేరలేదు.

ఆటో రూపంలో వచ్చిన మృత్యువు


మహేష్‌ (ఫైల్‌)


నవీన్‌ (ఫైల్‌)

కవల సోదరులు మహేష్‌, నవీన్‌తో పాటు వారి స్నేహితుడు పవన్‌ బైక్‌పై పెరికసింగారం వెళ్తుండగా మార్గమధ్యలో మద్దులపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ట్రాలీ ఆటో వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్‌, నవీన్‌ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, పవన్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. కాగా, అమ్మమ్మ దగ్గరకు వెళ్తున్నామని చెప్పి బయలుదేరిన మహేష్‌, నవీన్‌ మృతి చెందారని తెలియడంతో స్వగ్రామమైన దానవాయిగూడెంతో పాటు అమ్మమ్మ ఊరైన పెరికసింగారంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

కలిసి జన్మించిన కుమారులు కలిసే పెరిగి కుటుంబానికి అండగా నిలుస్తారని భావిస్తున్న తరుణంలో ఒకేసారి కన్ను మూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెక్కల కష్టంతో కుమారులిద్దరిని చదివించామని, ఉద్యోగాలు సాధించేందుకు శిక్షణ పొందుతుండగా ఇలా జరిగిందని వారు రోదిస్తున్న తీరుతో అంతా కంటతడి పెట్టారు. ఈమేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా తల్లిదండ్రులు, బంధువులు రాత్రంతా రోదిస్తూ అక్కడే గడిపారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

షెడ్యూల్‌ ప్రకారం ఓటరు జాబితా

- కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌
- జాబితాలో మార్పులు, చేర్పులపై అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌, పక్కన అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌, అధికారులు

ఖమ్మంసహకారనగర్‌: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను షెడ్యూల్‌ ప్రకారం పూర్తి చేసేలా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులతో ఓటరు జాబితా సవరణ, ప్రజావాణి అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఈనెల 20నుండి అక్టోబర్‌ 18వరకు ఇంటింటి పరిశీలన, పోలింగ్‌ కేంద్రాల రేషనలైజేషన్‌ చేయాలని, ఆపై ముసాయిదా జాబితా విడుదల చేసి అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం వచ్చే ఏడాది జనవరి 6న తుది జాబితా విడుదల చేయాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే కాక చనిపోయిన, అనర్హుల పేర్లు తొలగించాలని సూచించారు. కాగా, మండల స్థాయిలో గ్రీవెన్స్‌కు మంచి స్పందన వస్తోందని.. తద్వారా కలెక్టరేట్‌కు రద్దీ తగ్గిందని కలెక్టర్‌ తెలిపారు. మండల కేంద్రాల్లో వస్తున్న దరఖాస్తులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. అలాగే, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజాపాలన కౌంటర్ల పునరుద్ధరించాలని తెలిపారు.

భూనిర్వాసితులకు న్యాయం

భూ నిర్వాసితులకు ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ తెలిపారు. ఖమ్మం–దేవరపల్లి హైవేలో భాగంగా ధంసలాపురం వద్ద ఎగ్జిట్‌ పాయింట్‌ నిర్మాణానికి 14మంది నుంచి 1.38 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యాన నిర్వాసితులతో మాట్లాడిన కలెక్టర్‌ ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి మెరుగైన పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

వేగంగా జాఫర్‌ బావి పునరుద్ధరణ

ఖమ్మంమయూరిసెంటర్‌: జిల్లా కేంద్రంలోని ఖిలాలో ఉన్న జాఫర్‌ బావి పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ ఆదేశించారు. మంగళవారం బావిని పరిశీలించిన ఆయన పురాతన కాలం మాదిరి స్తంభాల ఏర్పాటు, ఇతర పనులపై సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్‌ డి.మధుసూదన్‌ నాయక్‌, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీఓ ఎల్‌.రాజేందర్‌, తహసీల్దార్‌ సీహెచ్‌.స్వామి, కేఎంసీ అసిస్టెంట్‌ కమిషనర్‌ సంపత్‌, జిల్లా పర్యాటక అధికారి సుమన్‌ చక్రవర్తి, హెరిటేజ్‌ మ్యాటర్స్‌ ప్రతినిధులు రాజశ్రీ, వాత్సల్య, లితేష్‌ పాల్గొన్నారు.

సభ్యత్వం లేనివాళ్లకు వాటా ఇచ్చేది లేదు..


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సొసైటీ సభ్యులు

సత్తుపల్లి: ట్రైబల్‌ జాయింట్‌ ఫార్మింగ్‌ కోఆపరేటివ్‌ సొసైటీ బి.గంగారంలో సభ్యత్వం లేని వారికి భూముల్లో వాటా ఇచ్చేది లేదని అధ్యక్ష, కార్యదర్శులు సోయం అర్జున, కె.రామచంద్రరావు స్పష్టం చేశారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి గిరిజన సొసైటీ భూముల వివాదం నేపథ్యాన మంగళవారం వారు మాట్లాడారు. 1972లో బేతుపల్లి సర్వే నంబర్‌ 40/1లో 50 మందికి గిరిజన సొసైటీకి 125 ఎకరాలను అప్పటి సీఎం జలగం వెంగళరావు కేటాయించారని తెలిపారు. నలభై క్రితమే సొసైటీ నుంచి 32 మంది వెళ్లిపోగా 1988–89 నుంచి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ మూడు, ఆరు నెలలకు ఆడిట్‌ చేయిస్తున్నామని చెప్పారు. అంతేకాక కొత్త సభ్యులను చేర్చుకుంటూ బోగస్‌ సభ్యులను తొలగించడమే కాక మరణించిన వారి స్థానంలో వారసులకు చోటు కల్పించామని తెలిపారు. ప్రస్తుతం 47 మంది సభ్యులు ఉండగా 2022తో సొసైటీ కాలపరిమితి ముగిసిందన్నారు. కాగా, సొసైటీ సభ్యులకుపాస్‌ పుస్తకాలు వస్తున్న సమయాన కొందరు వివాదం సృష్టించి అడ్డుపడుతున్నారని వారు వాపోయారు. ఇక గిరిజన సొసైటీకి సంబంధం లేని పది మందికి రామగోవిందాపురంలో 1.5 ఎకరాల చొప్పున ప్రభుత్వం ఇస్తే ఆ భూమిని అమ్ముకొని తమ భూమి విషయమై కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఊకె సింగరాజు, ఊకె రాములు, గండి నగేష్‌, సోయం వెంకటేష్‌, ఊకె మల్లేష్‌, కాక నాగేశ్వరరావు, ఊకె భీమారావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌ఓఎస్‌డీ శ్రీనివాస్‌

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ (డీసీసీబీ) డీఆర్‌ఓఎస్‌డీ(డిప్యూటీ రిజిస్ట్రార్‌ ఆఫీస్‌ ఆన్‌ స్పెషల్‌ డ్యూటీ)గా అవధానుల శ్రీనివాస్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వరంగల్‌ సహకార ట్రిబ్యునల్‌ కోర్టులో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయనను ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయం డీఆర్‌ఓఎస్‌డీగా బదిలీ చేశారు. గతంలో జిల్లా సహకార శాఖలో వివిధ హోదాల్లోనే కాక డీసీఎంఎస్‌ బిజినెస్‌ మేనేజర్‌గా శ్రీనివాస్‌ విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం డీఆర్‌ఓఎస్‌డీ హోదాలో సహకార బ్యాంకుల్లో పేరుకుపోయిన రుణ బకాయిల వసూళ్లను ఆయన పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ నిర్వహిస్తుండగా డీసీసీబీలో ఎక్కువ మంది రైతులు మాఫీ కాలేదని చెబుతున్నారు. ఈనేపథ్యాన దాదాపు రూ.600 కోట్ల మేర పంట రుణాలు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటికి తోడు ఇతర రుణాలతో పాటు తప్పుడు ధృవపత్రాలతో మార్ట్‌గేజ్‌ రుణాలు తీసుకున్న కేసు కొనసాగుతోంది.

లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు

అర్బన్‌ పోలీసులను ఆశ్రయించిన మహిళ

ఖమ్మంఅర్బన్‌: కూలీ పని ఉందని చెప్పి తీసుకెళ్లిన మహిళ బలవంతంతో మరో వ్యక్తి తనపై లైంగిక దాడి చేశాడని ఓ మహిళ ఖమ్మం అర్బన్‌ (ఖానాపురం హవేలీ) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుకు సంబంధించి సీఐ భానుప్రకాశ్‌ తెలిపిన వివరాలు... భర్తతో విడిపోయిన 42ఏళ్ల మహిళ కుమార్తెతో కలిసి ఖమ్మం పాండురంగపురంలో అద్దె ఇంట్లో జీవిస్తోంది. కూలీ పనులకు వెళ్లి పొట్టపోసుకుంటున్న ఆమెను అదే ఇంటి మరో పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న మహిళ ఈనెల 12న ముదిగొండ మండలం పెద్ద మండవలో పని ఉందని చెప్పడంతో బాధిత మహిళ జెడ్పీ సెంటర్‌కు వెళ్లింది. అక్కడ ఓ వ్యక్తి వచ్చి బైక్‌పై ఇద్దరిని తీసుకెళ్తూ బోనకల్‌ క్రాస్‌ నుంచి నామారం మీదుగా పెద్ద మండవ మార్గంలో వెళ్లాడు. మార్గమధ్యలో మద్యం కొనుగోలు చేయగా వారిద్దరూ తాగాక ఆ మహిళ తన రెండు చేతులు గట్టిగా పట్టుకుంటే బైక్‌పై తీసుకొచ్చిన వ్యక్తి లైంగిక దాడి చేశాడని బాధితురాలు ఆరోపిస్తోంది. అంతేకాక ఎవరికైనా చెబితే తనతో పాటు కుమార్తెను చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొంది. మరుసటి రోజు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తన కుమార్తెతో కలిసి పక్క పోర్షన్‌లో ఉండే మహిళను ప్రశ్నించగా ఆమె భర్తతో కలిసి తమను చితకబాదారని, దీంతో ఈనెల 14న ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెబుతోంది. అయితే, ఆ రోజు ఫిర్యాదులో లైంగిక దాడి జరిగిన విషయాన్ని ప్రస్తావించకపోగా.. మంగళవారం బాధితురాలికి తీవ్ర కడుపునొప్పి, రక్తస్రావం అవుతోందని చెప్పడంతో ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్‌తో కలిసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా లైంగిక దాడి విషయం బయటపడినట్లు తెలిసింది. ఈవిషయమై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా బాధిత మహిళ రెండు సార్లు ఇచ్చిన ఫిర్యాదులో తేడాలు ఉన్నందున పూర్తి స్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన హార్వెస్టర్‌

తప్పిన పెను ప్రమాదం


ఘటనాస్థలంలో ఆర్టీసీ బస్సు, హార్వెస్టర్‌

కొణిజర్ల: పెసరకాయలు కోయడానికి వచ్చిన హార్వెస్టర్‌ ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీకొట్టిన ఘటన కొణిజర్ల సమీపాన ఎన్నెస్పీ కాల్వ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గుగులోత్‌ సూరజ్‌ తెలిపిన వివరాలు.. మధిర నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు కొణిజర్ల ఎన్నెస్పీ కాల్వ వద్దకు చేరుకోగానే కాల్వ కరకట్ట పైనుంచి వచ్చిన హార్వెస్టర్‌ వెనక భాగంలో ఢీకొట్టింది. బస్సు డ్రైవర్‌ అప్రమత్తంగా వ్యవహరించి పక్కకు తప్పించడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఒకవేళ హార్వెస్టర్‌ నేరుగా బస్సును ఢీకొడితే ప్రయాణికులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా సిబ్బందితో చేరుకున్న రాకపోకలను క్రమబద్ధీకరించారు.

ఉద్యోగోన్నతి పొందిన వారికి పోస్టింగ్‌

ఖమ్మం సహకారనగర్‌: జిల్లాలోని పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు పలువురికి ఇటీవల పదోన్నతులు లభించాయి. ఆయా ఉద్యోగులకు రాగా పోస్టింగ్‌ ఇస్తూ శాఖ కమిషనర్‌ డీఎస్‌.చౌహాన్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా అసిస్టెంట్‌ సివిల్‌ సప్లయీస్‌ ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఖమ్మం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.చందన్‌కుమార్‌కు ఇక్కడే పోస్టింగ్‌ ఇచ్చారు. అలాగే, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న జి.శ్రీలతను ఇక్కడే మేనేజర్‌గా కేటాయించారు. అంతేకాక జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్‌ సివిల్‌ సప్లయీస్‌ ఆఫీసర్‌ సురేందర్‌కు సిద్దిపేట జిల్లాకు, ఖమ్మం అర్బన్‌ డీటీ మహమ్మద్‌ అబ్దుల్‌ నిసార్‌కు మెదక్‌ జిల్లాలో పోస్టింగ్‌ ఇచ్చారు.

హెచ్‌ఎంకు బదులు జెండా ఎగురవేసిన మహిళ


జాతీయజెండా ఎగురవేస్తున్న అనూష

బోనకల్‌: మండలంలోని రాపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొల్లికొండ సురేష్‌ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 15న తాను కాకుండా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు చింతపట్ల అనూషతో జాతీయ పతాకాన్ని ఎగురవేయించారని గ్రామస్తులు ఆరోపించారు. ఈవిషయమై గ్రామస్తులు తోట చలపతి ఆధ్వర్యాన మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వరావుకు ఫిర్యాదు చేశారు. కాగా, రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున కూడా ఆమెతోనే జెండా ఎగురవేయించినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్‌: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో నిందితుడికి ఆరు నెలల శిక్ష విధిస్తూఖమ్మం ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప తీర్పు చెప్పారు. మంగళవారం వెల్లడైన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన పసుపులేటి శ్రీనివాసరావు వద్ద తెనాలి ఆంజనేయప్రసాద్‌ 2016లో రూ.10లక్షల అప్పు తీసుకుని ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. ఆర్వాత రుణం తిరిగి చెల్లించాలని అడగడంతో 2018 జనవరి 22న రూ.13లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, చెక్కును శ్రీనివాసరావు బ్యాంకులో జమ చేస్తే ఖాతాలో సరిపడా నగదు లేక బౌన్స్‌ అయింది. దీంతో న్యాయవాది బిళ్ల శ్రీనివాసరావు ద్వారా నోటీస్‌ జారీ కోర్టులో ప్రైవేట్‌ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు విచారణ అనంతరం ఆంజనేయప్రసాద్‌కు ఆరునెలల శిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.20లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

తపాలా శాఖలో 11 మందికి పదోన్నతి

ఖమ్మంగాంధీచౌక్‌: తపాలా శాఖ తెలంగాణ సర్కిల్‌ పరిధిలో నిర్వహించిన శాఖాపరమైన పరీక్షల్లో అర్హత సాధించిన 94 మంది పోస్టుమెన్లు, ఎంటీఎస్‌లు, మెయిల్‌ ఓవర్సీ(ఎంఓ)లకు పోస్టల్‌ అసిస్టెంట్లుగా, ఆర్‌ఎస్‌ఎంలో సార్టింగ్‌ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే, వీరిని వివిధ డివిజన్లకు బదిలీ చేశారు. ఇందులో ఖమ్మం తపాలా డివిజన్‌ నుంచి 11 మంది ఉండగా, వీరిలో ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో ఆరుగురు ఉన్నారు. పదోన్నతి పొందిన ఉద్యోగులను ఖమ్మం డివిజన్‌ పోస్టల్‌ డివిజన్‌ సూపరింటెండెంట్‌ వీరభద్ర స్వామి, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

పదోన్నతి పొందిన ఉద్యోగుల వివరాలు

పేరు	ప్రస్తుత హోదా	పదోన్నతి	బదిలీ స్థానం
ఎన్‌.సందీప్‌కుమార్‌	పోస్ట్‌మ్యాన్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	ఖమ్మం
రాజేష్‌	ఎంటీఎస్‌	సార్టింగ్‌ అసిస్టెంట్‌	కాజీపేట
శేషు	ఎంఓ	సార్టింగ్‌ అసిస్టెంట్‌	కాజీపేట
రాజశేఖర్‌	పోస్ట్‌మ్యాన్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	ఖమ్మం
పూర్ణాచారి	పోస్ట్‌మ్యాన్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	సూర్యాపేట
నాగేశ్వరరావు	పోస్ట్‌మ్యాన్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	సూర్యాపేట
శివకృష్ణ	పోస్ట్‌మ్యాన్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	వనపర్తి
రాజేంద్రప్రసాద్‌	పోస్ట్‌మ్యాన్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	నిజామాబాద్‌
వెంకటేష్‌	ఎంటీఎస్‌	పోస్టల్‌ అసిస్టెంట్‌	వరంగల్‌
సురేష్‌కుమార్‌	ఎంఓ	పోస్టల్‌ అసిస్టెంట్‌	కాజీపేట
రాజేంద్రనాయక్‌	ఎంఓ	పోస్టల్‌ అసిస్టెంట్‌	నిజామాబాద్‌

విద్యార్థులు వంద శాతం హాజరుకావాలి


హెచ్‌ఎంల సమీక్షలో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కారేపల్లి: పాఠశాలకు విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని, ఎవరైనా గైర్హాజరైతే వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ సూచించారు. కారేపల్లి మండలంలోని బొక్కలతండా, కారేపల్లి, సింగరేణి ప్రాథమిక పాఠశాలలు, గేటుకారేపల్లి, కారేపల్లి హైస్కూళ్లను మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగావిద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించాక కారేపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. హైస్కూళ్లలో ఈనెల 21నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాఠశాలల్లో కిచెన్‌ గార్డెన్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, మధ్యాహ్నం 3.30 గంటలకు డ్రిల్‌ పీరియడ్‌ను నిర్వహిస్తూ ఎక్కాలు, ఆంగ్ల పదాల పఠనం, పద్యాలు చెప్పించాలని డీఈఓ తెలిపారు. ఈ తనిఖీల్లో ప్లానింగ్‌ కోఆర్డినేటర్‌ సీహెచ్‌.రామకృష్ణ, ఎంఈఓ జయరాజు, నోడల్‌ ఆఫీసర్‌ కర్నాటి శ్రీనివాసరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మధిర టు మధిర వయా కాగజ్‌నగర్‌!

మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ తిరిగి ఉద్యోగి చేతికి..


ల్యాప్‌టాప్‌ అప్పగిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

మధిర: రైలులో ప్రయాణించిన ఓ ఉద్యోగి మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను రైల్వే పోలీసులు తిరిగి ఆమె దరికి చేర్చారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... విజయవాడకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ మక్కా శ్రీదేవి మధిరలోని తన మేనమామ దేవిశెట్టి రంగారావు ఇంటికి సోమవారం ఉదయం గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. రైలు మధిరకు వచ్చాక దిగే సమయాన ఆమె ల్యాప్‌టాప్‌ బ్యాగ్‌ మర్చిపోయింది. ఇంటికి వచ్చాక గుర్తించిన ఆమె తన మేనమామ సహకారంతో జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అప్పటికే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ సికింద్రాబాద్‌ చేరుకుని తిరిగి భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌గా మారి సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ బయలుదేరినట్లు చెప్పిన ఆయన అక్కడి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు శ్రీదేవి ప్రయాణించిన డీ–1 బోగీలో వెతకగా ల్యాప్‌టాప్‌ బ్యాగ్‌ ఉండడంతో మరో రైలులో మధిర పంపించారు. ఈమేరకు శ్రీదేవి మేనమామ రంగారావుకు మంగళవారం జీఆర్పీ హెడ్‌ కానిస్టేబుల్‌ బ్యాగ్‌ అప్పగించడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

సత్తుపల్లిలో మూడు ఇళ్లలో చోరీ

రూ.12లక్షలకు పైగా సొత్తు అపహరణ


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్‌: తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకున్న దుండగులు సత్తుపల్లిలోని మూడు ఇళ్లలో సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గంగారం ప్రకాష్‌నగర్‌ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అఖిల పర్వీన్‌, గియాజ్‌ దంపతులు హనుమాన్‌నగర్‌లోని ఇంటికి తాళం వేసి సిద్ధారం రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద ఉంటున్నారు. ఈక్రమంలో తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు పగులగొట్టి బీరువాలోని రూ.11.37 లక్షల విలువైన 158 గ్రాముల బంగారం, 90 తులాల వెండి ఆభరణాలే కాక రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తీసి ఉన్నా ఎవరూ లేకపోవడంతో స్థానికులు గమనించి చెప్పగా పర్వీన్‌, గియాజ్‌ వచ్చేసరికి చోరీ జరిగినట్లు తేలింది. అలాగే, హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి గుడి వెనుక వీధికి చెందిన సిద్ధారం లైన్‌మెన్‌ బానోత్‌ నాగేశ్వరరావు రాఖీ పండుగ కోసం ఇంటి తాళం వేసి ఊరు వెళ్లారు. ఆయన మంగళవారం వచ్చేసరికి తాళం తొలగించి ఇంట్లోని రూ.40వేల నగదు, రూ.24వేల విలువైన 26 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆ ఇంటి పక్కనే తాళం వేసి ఉన్న పొంద్రి వాసు ఇంట్లోనూ చొరబడిన దొంగలు రూ.7వేల నగదు, వెండి వస్తువులు చోరీ చేయగా సత్తుపల్లి ఏసీపీ ఎ.రఘు, ఇన్‌చార్జ్‌ ఎస్సై వీర ప్రసాద్‌తో పాటు ఖమ్మం నుంచి వచ్చిన క్లూస్‌ టీం సభ్యులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.న్నారు.

పరదా కడితే.. పడదా?

పెచ్చులు కిందపడకుండా పరదాలు కట్టిన వైనం
పెనుగొండ జెడ్పీ పాఠశాలలో పిల్లల దుస్థితి


పెనుగొండ జెడ్పీ హైస్కూల్ స్లాబ్‌కు పరదాలు కట్టిన దృశ్యం.. చదువుకుంటున్న విద్యార్థులు


పెనుగొండ హైస్కూల్‌లోని గదిలోని పెచ్చులూడిన స్లాబ్

కేసముద్రం: తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న ఓ బడిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు నెట్టుకొచ్చేస్తున్నారు. తాత్కాలికంగా పరదాలు కట్టి అడ్డు పెట్టినా ఒక్కోసారి పెద్ద పెద్ద పెచ్చులను పరదాలు కూడా ఆపలేకపోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పిల్లల దుస్థితి మాత్రం మారలేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో 165 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 9 గదులకు గాను ఒక గది స్టోర్ రూం, మరో గది స్టాఫ్‌కు కేటాయించారు. పాఠశాలలో స్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడిపడుతూ, ఇనుప సలాకలు కిందకు వేలాడుతున్నాయి. ఇలా నాలుగు తరగతి గదుల్లో పై పెచ్చులు పడుతుండటంతో వాటిని తప్పించుకునేందుకు పిల్లలు ప్రాణభయంతో బయటకు పరుగులు తీస్తున్నారు. ఇక వర్షం పడినప్పుడల్లా స్లాబ్ కురుస్తుండటం, దాంతో పాటు పెచ్చులు పడుతుండటంతో పిల్లలను పక్కనే ఉన్న డైనింగ్ హాల్‌లో కూర్చోబెడుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి తెలిపారు.

కెమికల్ లోడ్ మాటున గంజాయి తరలింపు

- రూ 1.80 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్


దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

దమ్మపేట: కెమికల్ లోడ్ మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న రూ 1.80 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి కెమికల్ లోడుతో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను దమ్మపేట మండలం అచ్యుతాపురం క్రాస్‌రోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు తనిఖీ చేశారు. వాహనం కింద భాగంలో 247 ప్యాకెట్లలో తరలిస్తున్న 508 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాసిక్ జిల్లాకు చెందిన 12 మంది ముఠాగా ఏర్పడి గంజాయి తరలిస్తున్నారని, అక్కడ చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పుణె, ముంబై వంటి నగరాల్లో విక్రయిస్తుంటారని ఎస్పీ తెలిపారు. ఈ ముఠాలోని ఆరుగురిని అరెస్ట్ చేశామని, గంజాయి సరఫరా చేసిన కోరాపుట్ జిల్లాకు చెందిన శ్రీనుతోపాటు మిగతా ఆరుగురు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. గంజాయి నియంత్రణలో తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఏడాది కాలంలో 62 కేసులు నమోదు చేసి రూ. 20 కోట్ల విలువైన 6,500 కిలోల గంజాయిని సీజ్ చేశామని వివరించారు. సమావేశంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ బెల్లం సత్యనారాయణ, ఎస్సైలు సాయికిషోర్‌రెడ్డి, జలకం ప్రవీణ్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి భర్త.. ఉరేసుకుని భార్య ఆత్మహత్య

సంతానం లేకపోవడంతో దంపతుల మధ్య కలహాలు


మృతిచెందిన దంపతులు గురువయ్య, వెంకటమ్మ(ఫైల్)

బెల్లంపల్లి రూరల్: సంతానం కలుగకపోవడం ఆ దంపతుల మధ్య కలహాలకు కారణమైంది. ఘర్షణకు దారితీసి భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె ఆస్పత్రి పాలైంది. దీంతో వేదనకు గురైన భర్త క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు దూరమై జీవించలేక భార్య ఉరేసుకుని తనువు చాలించింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధి కాసిరెడ్డిపల్లెకు చెందిన గురువయ్యతో వెంకమ్మ అలియాస్ వెంకటమ్మకు ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కూలి పనులు చేసుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. ఇన్నేళ్లయినా సంతానం కలుగకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తేవి. ఒక్కోసారి తీవ్ర ఘర్షణకు దారి తీసేవి. ఈ క్రమంలో గత ఆదివారం గురువయ్య తన భార్య వెంకటమ్మతో గొడవపడి ఆమెను తీవ్రంగా కొట్టడంతో ఆస్పత్రి పాలైంది. తన వల్లే భార్య ఆస్పత్రిపాలు కావడం, మరోవైపు తమకు సంతానం కలగడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన గురువయ్య అదే రోజు క్రిమి సంహారక మందు తాగాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. అంత్యక్రియలు పూర్తి చేసిన వెంకటమ్మ.. భర్త మరణాన్ని తట్టుకోలేక సోమవారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు చీరతో ఉరేసుకుంది. అందరితో కలివిడిగా ఉండే దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూతురి పెళ్లి డబ్బుల కోసం హత్య

- కల్లు సీసా ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: కూతురి పెళ్లి చేసేందుకు అవసరమైన డబ్బు కోసం పథకం ప్రకారం ఓ మహిళను మరో మహిళ హత్య చేసింది. ఘటనా స్థలంలో దొరికిన కల్లు సీసా ఆధారంగా విచారణ చేసిన పోలీసులు నిందితురాలిని పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నవాబ్‌పేటకు చెందిన లక్ష్మమ్మ (48) కొడుకు, కోడలు హైదరాబాద్‌లో ఉండటంతో ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. నవాబ్‌పేటకు చెందిన పద్మమ్మకు లక్ష్మమ్మతో పాత పరిచయం ఉండటంతో ఇద్దరూ కలిసి నిత్యం కల్లు తాగేవారు. ఈ క్రమంలోనే పద్మమ్మ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో పాటు కూతురి పెళ్లికి డబ్బులు కావాల్సి వచ్చాయి. దీంతో ఎలాగైనా లక్ష్మమ్మను హత్య చేసి ఆమె దగ్గర ఉన్న బంగారం, వెండి తీసుకోవాలని పథకం వేసింది. ఏప్రిల్ 12న రాత్రి ఇద్దరూ కలిసి కల్లు తాగిన తర్వాత లక్ష్మమ్మ నిద్రపోతున్న సమయంలో పద్మమ్మ అర్ధరాత్రి సమయంలో రోకలిబండతో తలపై బాది హత్య చేసింది. ఆ తర్వాత ఆమె దగ్గర ఉన్న 30 తులాల వెండి, ఒక తులం బంగారం, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేయగా ఇంట్లో దొరికిన కల్లుసీసా ఆధారంతో పాటు టెక్నికల్ క్లూస్ సేకరించిన సాక్ష్యాలతో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పద్మమ్మను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చందాదారులెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. అయితే అనంతరం ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (వైఎస్సార్ సీపీ హయాంలో) సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. మరోవైపు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు అన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024 ఏప్రిల్ 9న కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. మార్గదర్శి డిపాజిట్ల సేకరణకు సంబంధించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని పేర్కొంది.

మార్గదర్శి అక్రమాలను ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చింది..: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో తెలంగాణ హైకోర్టు తాజాగా మరోసారి విచారణ ప్రారంభించింది. సీనియర్ జడ్జి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ప్రతివాదుల జాబితాలో చేర్చింది. గత విచారణ (ఈనెల 6వతేదీన) సందర్భంగా కౌంటర్ దాఖలుకు చివరి అవకాశం ఇవ్వాలన్న ఆర్‌బీఐ వినతికి అంగీకరిస్తూ ఇకపై ఈ పిటిషన్లను మోషన్ లిస్ట్‌లో పేర్కొనాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ వసూలు చేసిన డిపాజిట్లన్నీ చట్టవిరుద్ధం, అక్రమమేనని, అందుకు బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని నివేదిస్తూ ఈ నెల 13న ఆర్బీఐ తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ క్రమంలో మంగళవారం జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాదితోపాటు తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు, ఆర్బీఐ న్యాయవాది కె.రతంగపాణిరెడ్డి హాజరయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ చట్టం 45 (ఎస్)ను ఉల్లంఘించినట్లు ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చిందని ఈ సందర్భంగా ఉండవల్లి హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీని ఆధారంగా మార్గదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నివేదించారు. దాదాపు 70 వేల మంది చందాదారుల వివరాలను 1,500కిపైగా పేజీల్లో మార్గదర్శి సుప్రీం కోర్టుకు సమర్పించిందని, ఆ వివరాలను హైకోర్టుకు కూడా పెన్‌డ్రైవ్‌లో అందజేసేలా ఆదేశించాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్ స్పందిస్తూ.. వివరాలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఆ మేరకు ఆర్బీఐ, మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

కాంగ్రెస్సే కవితకు బెయిల్ ఇప్పిస్తోంది



ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కు: బండి సంజయ్

మహేశ్వరం: కేసీఆర్ కూతురు కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇందుకు సంబంధించిన కేసును కాంగ్రెస్ నుంచి కాబోయే రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీయే కోర్టులో వాదిస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో మంగళవారం నిర్వహించిన సూర్యగిరి రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు హాజరైన సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. కేసీఆర్ సూచించిన వారికే రాష్ట్రంలో మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, రాజ్యసభ సీట్లు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ఫాంహౌస్‌కు క్యూ కడుతున్నారని వ్యాఖ్యానించారు. అభిషేక్ సింఘ్వీ అనుభవజ్ఞుడైన న్యాయవాది అని, ఆయన తెలంగాణ నుంచి ఎంపీ అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం కోర్టుల్లో, పార్లమెంట్‌లో గట్టిగా వాదిస్తారనుకుంటే .. లిక్కర్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కవిత బెయిల్ కోసం వాదిస్తున్నారని ఎద్దేవా చేశారు.

అందరినీ అనుమతించాం

బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాఖీ పండుగ రోజున విద్యార్థినుల తల్లిదండ్రులు, సోదరులను గురుకులంలోనికి అనుమతించామని రాజన్న సిరిసిల్ల జిల్లా బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ చెప్పారు. మంగళవారం ఆమె కలెక్టర్‌కు వివరణ ఇస్తూ లేఖ రాశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రుల రాక మొదలు కాగా, జోనల్ ఆఫీసర్ సూచనల మేరకు అనుమతించామన్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు ఒకేసారి ఎక్కువ మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారని, చిన్న గేటు ద్వారా చెక్ చేస్తూ పంపించామని చెప్పారు. కాగా, కిటికీల ద్వారా రాఖీలు కట్టిన తమ పిల్లలను పాఠశాలలో ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని, కాబట్టి జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా వార్తలు

క్రీడాకారిణికి రూ.10వేల ఆర్థికసాయం


అభినయశ్రీకి నగదు అందజేస్తున్న విజేత

ఖమ్మంఅర్బన్: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థినికి ఖమ్మం మహిళా ప్రాంగణం మేనేజర్ విజేత తమ ఫౌండేషన్ ద్వారా మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ముదిగొండ కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చల్లగొండ అభినయశ్రీ కరాటేలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ఈనెల 30 నుంచి నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన అభినయశ్రీ నేపాల్ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న విజేత తమ ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందజేసి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు జీఎం కార్యాలయం ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీ విస్తరణలో భాగంగా నిర్మించిన ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం, వర్క్‌షాపులను ఈనెల 22న గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు వెల్లడించారు. జీఎం కార్యాలయం, వర్క్‌షాప్‌లతో పాటు జగన్నాథపురం(చెరుకుపల్లి)లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.9 కోట్లతో అభివృద్ధి చేసిన పాఠశాల, చర్చి, గుడి, కమ్యూనిటీ హాల్‌ను సైతం డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేతో పాటు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

మణుగూరు టౌన్: యాంత్రిక శక్తిని పూర్తిగా వినియోగించుకుంటూ బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ఆటంకాలు ఎదురుకాకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మణుగూరు ఏరియాలో మంగళవారం పర్యటించిన ఆయన ఓసీ–2, 4 గనుల్లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం 126.5లక్షల టన్నుల మేర బొగ్గును ఉత్పత్తి చేసేలా కృషి చేయాలన్నారు. డైరెక్టర్ వెంట ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓ లక్ష్మీపతిగౌడ్, అధికారులు వెంకట్రావు, వీరభద్రుడు, సురేశ్ ఉన్నారు.

రైతుల పక్షాన పోరాటాలు చేస్తాం


అధికారులతో మాట్లాడుతున్న హరిప్రియ, నాయకులు

- పూర్తి స్థాయిలో రుణమాఫీ సాధనే బీఆర్‌ఎస్ లక్ష్యం
- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన పోరాడుతూ రైతులకు మేలు జరిగే వరకు విశ్రమించేది లేదని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ స్పష్టం చేశారు. రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేయాలనే డిమాండ్‌తో నాయకులతో కలిసి టేకులపల్లిలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలంపాడు క్రాస్‌లోని రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. దరఖాస్తులను ఎప్పటిలోగా పరిష్కరించి రుణమాఫీ అమలుచేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విఫలమైందని ఆరోపించారు. ఈవిషయమై బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తుండడం, రైతులు ఆందోళన చేస్తుండడంతో హడావుడిగా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ ఎప్పటిలోగా పరిష్కరిస్తారనే విషయమై అధికారుల వద్ద సమాధానం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రుణమాఫీ హామీ ఇచ్చి ఇప్పుడు షరతులు విధించడం సరికాదని హరిప్రియ తెలిపారు. వారం, పది రోజుల్లో ప్రక్రియ పూర్తి స్థాయిలో పూర్తికాకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, నాయకులు మాలోతు శివనాయక్, బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, భూక్యా లాలునాయక్, బానోతు కిషన్, తేజావత్ రవి, బర్మావత్ శివ, కుమ్మరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఉత్తరం రాద్దాం!


ఉత్తరాలతో పాఠశాల విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: కుటుంబ పెద్దలను గౌరవించడం.. వారితో మంచీచెడు పంచుకునేలా పిల్లల్లో అవగాహన కల్పించేందుకు ఖమ్మంలోని మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. పత్తిపాక ఫౌండేషన్, గరిపల్లి ట్రస్ట్ ప్రోత్సాహంతో చొక్కాపు వెంకటరమణ సారథ్యాన అవ్వాతాతలకు ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు సయ్యద్ షఫీ కన్వీనర్‌గా వ్యవహరించగా 50 మంది విద్యార్థులు తమ అవ్వాతాతలకు లేఖలు రాసి కవర్లలో పెట్టి పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంతో బంధాలు, ప్రేమానురాగాల విలువ తెలుస్తుందని హెచ్ఎం ఎం.జానకి అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్రంలో తొలి విడతగా 80 పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపట్టగా ఖమ్మం జిల్లా నుండి మోమినాన్ పాఠశాలలో నిర్వహించారు.

కొవ్వూరు రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగాచార్యులు

కొత్తగూడెంఅర్బన్: కొవ్వూరు రైల్వే లైన్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొడమసింహ పాండురంగాచార్యులు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేసేలా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కేంద్రానికి లేఖ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇరు రాష్ట్రాల సీఎంలు చొరవ చూపితే తప్ప ఫలితం ఉండదని తెలిపారు. కొవ్వూరు రైల్వేలైన్‌ను 2014లో మంజూరైందని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కలిసి విషయాన్ని సీఎంల దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ లైన్‌కు నిధులు కేటాయించడంతో పాటు కొత్తగూడెం నుంచి తిరుపతి, షిర్డీకి రైళ్ల ఏర్పాటు, గతంలో రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై సంతకాలు సేకరించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు పాండురంగాచార్యులు వెల్లడించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మందుల జయరాజు, పవన్‌కళ్యాణ్, చలం, కల్లూరి కృష్ణ, సతీష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 5వ దశలో సాంకేతిక సమస్య కారణంగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం గల తొమ్మిదో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడినట్లు గుర్తించిన అధికారులు సోమవారం అర్ధరాత్రి ఉత్పత్తి నిలిపేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నామని, బుధవారం నాటికి ఉత్పత్తి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సీఈ ఎం.ప్రభాకర్ రావు తెలిపారు.


ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

తాలిపేరుకు పోటెత్తిన వరద

భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి భారీ వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి వరద మొదలైంది. దీంతో మంగళవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లను రెండేసి అడుగుల మేర ఎత్తి 14,508 క్యూసెక్కుల చొప్పున వరదను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా వరద ఉధృతి ఆధారంగా నీటిమట్టాన్ని 73.51 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. – చర్ల

రూ.36.90లక్షలతో కమ్యూనిటీ హాల్

'సేవ్ భద్రాద్రి' ఆధ్వర్యాన ఈనెల 28న శంకుస్థాపన


మాట్లాడుతున్న సేవ్ భద్రాద్రి వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో వివిధ అవసరాలకు ఉపయోగపడేలా సేవ్ భద్రాద్రి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు వ్యవస్థాపకుడు పాకాల దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2022లో గోదావరి వరదల సమయాన సంస్థను స్థాపించి రూ.36.90 లక్షల విరాళాలు సేకరించామని తెలిపారు. దాతలు ఇచ్చిన ఈ నగదు పదిమందికి ఉపయోగపడాలనే భావనతో పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద దేవాదాయ శాఖ స్థలంలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిర్ణయించినట్లు చెప్పారు. వరదల వచ్చినప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలకు ఆశ్రయం కల్పించడమే కాక కేంద్ర బలగాలు నివాసముండేలా ఈ హాల్ నిర్మించనున్నట్లు చెప్పారు. అంతేకాక పేద ప్రజలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కూడా ఉపయోగపడేలా ఈ హాల్ నిర్మాణానికి 28న శంకుస్థాపన చేస్తామని దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చారుగుళ్ల శ్రీనివాస్‌తో పాటు ఎస్.కే.అజీమ్, పరిమి సోమశేఖర్, ముని కేశవ్, గాదె మాధవరెడ్డి, శ్రీనివాస్, పామరాజు తిరుమలరావు, బాలనర్సారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు లేని షరతులు ఇప్పుడెందుకు?



సమావేశంలో మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల సమయాన రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు షరతుల పేరిట ఇబ్బంది పెట్టడం ఏమిటని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య ప్రశ్నించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన ఆంక్షలతో లక్షలాది మంది రైతులకు రుణమాఫీకి దూరమయ్యారని తెలిపారు. అధికారిక లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లాలో 3.71 లక్షల మందికి గాను 1,15,000 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని చెప్పారు. రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను చెల్లిస్తేనే మాఫీ చేస్తామనడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతోనే నేడు లక్షలాది మంది రైతులు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో ఈనెల 28 కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మణ్, పాశం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.